క్లుప్తంగా

ముత్యాలమ్మకు సారె సమర్పణ


ముత్యాలమ్మ అమ్మవారు

నల్లజర్ల: ఆవపాడు గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారు శనివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. 58 కావెళ్లతో వివిధ రకాల పిండివంటలు, అరటి పండ్లు, పసుపు, కుంకుమ తదితర రకాల ఆషాఢం సారెను మహిళలు సమర్పించారు. అమ్మవారికి పుట్టింటి వారిగా రుద్రా కుటుంబీకులు, అత్తింటి వారిగా అచ్యుతా వారు వ్యవహరిస్తున్నారు. బొమ్మిడికి చెందిన మల్లారెడ్డి సుధాకర్ గురువు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయం వద్ద గీతాపారాయణ చేశారు. అనంతరం అన్నదానం జరిగింది.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

కొవ్వూరు: స్థానిక పురపాలక సంఘం పరిధిలో రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత ఆదివారం ఉదయం పది గంటలకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్టు కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. పట్టణంలో రూ.1.78కోట్లతో చేపట్టిన సిమెంటు రోడ్లు, సీసీ డ్రైన్లు, తారురోడ్లను మంత్రి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. సాయంత్రం రెండు నుంచి ఆరు వరకు 8, 10, 14, 19 వార్డుల్లో చేపట్టిన పనులను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దేవరపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ డీఆర్‌బీ కృష్ణంరాజు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఉత్తర్వుల మేరకు ఖాళీలను భర్తీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను 5న పరిశీలించి, 6న ఇంటర్వ్యూలు, 7న ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 10న మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తారని, 11న ఎంపికైన గ్రామ వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తామని ఆయన తెలిపారు. దేవరపల్లి, గౌరీపట్నం, యర్నగూడెంలో ఒకొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాలు లోపు వారై ఉండాలని, స్థానికులై పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కొవ్వూరు: లయన్స్ క్లబ్ తరపున శనివారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ ప్రారంభించారు. మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందికి దంత వైద్య సేవలు అందించారు. రాజమహేంద్రవరానికి చెందిన సాయిరామ్ ఆసుపత్రి దంత వైద్యులు ఎం.రామ్‌కుమార్ దంత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం కొవ్వూరు జస్మిత ఆసుపత్రి ఎముకల వైద్య నిపుణుడు యలమర్తి గౌతమ్‌రాయుడుకి, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యులను ఘనంగా సన్మానించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కలగర వెంకట్రావు, పెనుమాక జయరాజు, కోశాధికారి ఉప్పులూరి రామకృష్ణ, పాలెంపాటి చినబాబు, యనమదల సుబ్రహ్మణ్యం, కంఠమణి రమేష్, గోలి వెంకటరత్నం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, కంఠమణి రామకిషోర్, గూడపాటి ప్రసాద్, మన్యం బులిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై చర్చ

నిడదవోలు: స్థానిక రాష్ట్ర పెన్షనర్ల సంఘ సమావేశ మందిరంలో శనివారం ప్రభుత్వ పెన్షనర్ల సంఘ నిడదవోలు శాఖ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పలు పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బలగం అప్పారావు, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు కొండా నిర్మల, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, సామ్రాజ్యం, పాంగురంగారావు, ఎలిపిన శేషగిరిరావు, బొజ్జా పాపారావు, ఖండవల్లి రంగాచార్యులు, మహ్మద్ జుహిద్దీన్, ఆరుగొళ్ళు వెంకటేశ్వర్లు, కె. రామారావు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ పంట బీమా

కొవ్వూరు: వైఎస్సార్ పంట బీమా పథకం ద్వారా డివిజన్‌లో రైతులకు ఈ నెల 8వ తేదీన బీమా సొమ్ములు జమ చేయనున్నట్టు ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమా పథకంలో జిల్లాలో అరటి పంటను నోటిఫైడ్‌గా తీసుకున్నారని అన్నారు. 2022 ఖరీఫ్‌లో రైతులకు పంట బీమా కింద సొమ్ములు విడుదలయ్యాయని, ఈనెల 8న ప్రభుత్వం ఖాతాలకు జమ చేస్తుందన్నారు. గైడ్ లైన్స్ ఆధారంగా కొవ్వూరు, పెరవలి మండలాల్లో ఎకరాకి రూ.4,125లు, చాగల్లు, తాళ్లపూడిలో రూ.6,600, ఉండ్రాజవరంలో రూ.2,475 చొప్పున ఒక్కో రైతుకి గరిష్టంగా ఐదెకరాలకు అందిస్తారని ఆయన తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

నిడదవోలు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ కోరారు. శెట్టిపేటలో భవన నిర్మాణ రంగ కార్మికుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు ఖండవల్లి వీరవెంకట్రావు, నాయకులు రావి వరహాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం

- హోమ్ మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల అందజేత


కొవ్వూరు పురపాలక సంఘం శ్రీరామ కాలనీలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలు సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర హోమ్ మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఒకటో వార్డు శ్రీరామ కాలనీలో నిర్వహించిన కార్యక్రమాన్ని మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు, జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. అనంతరం స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, టౌన్ పార్టీ ప్రెసిడెంట్ రుత్తల భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, స్థానిక నాయకులు పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్, నేతల వెంకటేష్, మాసా ఆనంద్, వేము వెంకటరత్నం, కమిషనర్ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కాపవరంలో సర్పంచ్ సుంకర పద్మిని అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 220 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను డీఎల్‌డీవో శాంతమణి, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు.

సచివాలయాల వద్ద అర్జీల స్వీకరణ: జేసీ తేజ్‌భరత్

దేవరపల్లి: గ్రామ సచివాలయాల వద్ద ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించడానికి అర్జీల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని గ్రామ సచివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ రాయి అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేసీ తేజ్‌భరత్ పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం, తాడిపూడి గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఈ గ్రామ సభల్లో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు పాల్గొన్నారు. వేగేశ్వరపురంలో 519 మందికి, తాడిపూడిలో 170 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, నామా శ్రీనివాస్, ఎంపీడీవో వెంకట రమణ, ఈవోపీఆర్డీ వీరన్న నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు అనూహ్య స్పందన

నిడదవోలు: పట్టణంలోని నెహ్రూనగర్ –1 వార్డు సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న సురక్ష కార్యక్రమానికి మొదటి రోజు ప్రజల నుంచి అనూహ్యస్పందన లభించింది. ఈ కార్యక్రమంలో 135 కుల ధ్రువీకరణ పత్రాలు, 273 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెండు కొత్త రేషన్ కార్డులను అందించడంతో పాటు ఎనిమిది మందికి ఫోన్ నంబర్‌తో ఆధార్ లింకేజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, జేసీఎస్ టౌన్ కన్వీనర్ ఎస్కే చాన్‌భాషా, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి గాజుల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని పందలపర్రు, విజ్జేశ్వరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమాలకు హాజరైన ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను అందజేశారు. జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధి తిక్కా శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలా బత్తుల సుజాత పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో ఉండ్రాజవరం, చివటం గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉండ్రాజవరంలో తహసీల్దార్ జి.కనకరాజు, చివటంలో ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగాయి.

చాగల్లు: మండలంలోని నందిగంపాడు, చంద్రవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. స్థానిక సచివాలయాల వద్ద ఎంపీడీఓ బి.రాంప్రసాద్ మాట్లాడుతూ చంద్రవరంలో 510, నందిగంపాడులో 194 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశామన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు


గౌరీపట్నంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గడప గడపకూ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గౌరీపట్నం గ్రామ సచివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించినట్టు ఆయన తెలిపారు. సర్పంచ్ రాయి అన్నపూర్ణ, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, వైఎస్సార్‌సీసీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు, ఈఓపీఆర్డీ రామచంద్రరావు పాల్గొన్నారు.

నల్లజర్ల, తెలికిచెర్లలో

నల్లజర్ల: మండలంలో నల్లజర్ల–2 సచివాలయంలో తహసీల్దారు కిశోర్‌కుమార్ బృందం, తెలికిచెర్లలో ఎంపీడీఓ రాజశేఖరం బృందం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని నల్లజర్లలో 300, తెలికిచెర్లలో 350 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.


గౌరీపట్నంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జేసీ తేజ్‌భరత్


వేగేశ్వరపురంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు


లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

వైద్యుల సేవలు అభినందనీయం


నల్లజర్లలో వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు: నిత్యం రోగులకు వైద్య సేవలందించి వారి ఆరోగ్యాలను మెరుగు పరచడంలో వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయి కిరణ్, వైద్యులు రాజేంద్రప్రసాద్, శాంతి కమల, సుభాషిణీ, రవికాంత్, ఆదిత్యాయి పూజలను ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు తీగెల రవి, కార్యదర్శి నాగుబండి ఫణి, వనిత క్లబ్ అధ్యక్షురాలు మద్దుల వెంకట లక్ష్మి, కార్యదర్శి ఎన్.దివ్య, కోశాధికారి గ్రంధి సంజన, తమ్ములపల్లి నాగ రమేష్, వలివేటి ప్రసాద్, నాగుబండి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం

నల్లజర్ల: స్థానిక నల్లజర్ల పీహెచ్‌సీలో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు బోడిగడ్ల సీతారాముడు మాట్లాడుతూ డాక్టర్స్‌డే సందర్భంగా ఏటా ప్రభుత్వ వైద్యులను సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టరు గంగాధరరావు, డాక్టరు సిరాజుద్దీలను సత్కరించారు.కార్యమక్రమంలో మానవత ఉపాధ్యక్షులు మద్దిపాటి ప్రసాద్, సీహెచ్‌ఓ పి.ప్రసాద్, రాధాకుమారి, సత్యనారాయణ, జీవీవీ ప్రసాద్, పీఎంపీలు పాల్గొన్నారు. దూబచర్ల లయన్స్‌క్లబ్ ఆధర్యంలో నల్లజర్లలోని దుర్గా హాస్పటల్ డాక్టరు బద్రి వీరశేఖరరావు, డాక్టరు ఘంటా వెంకటాద్రి, ఆర్.ఎం.పీ రేవాడ మురళీకృష్ణ, పి.వీరవెంకటకృష్ణకిశోర్‌లను క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు సత్కరించారు.

విద్యుత్ ఉపకరణాల వినియోగంలో అప్రమత్తత అవసరం

కొవ్వూరు: విద్యుత్ ఉపకరణాల వినియోగంలో ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను నివరించగలుగుతామని డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ జి.రఘు సూచించారు.ఆంధ్రాషుగర్స్ కర్మాగారంలో శనివారం ఎలక్ట్రికల్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మాగారంలో వివిధ రకాల విద్యుత్ ఉపకరణాల వినియోగంపై కార్మికులు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సేఫ్టీ ఇన్‌చార్జి కేవీవీ సత్యనారాయణ మూర్తి, పర్సనల్ మేనేజర్ సిహెచ్ సుఖమహార్షి తదితరులు పాల్గొన్నారు.

దాత సాయంతో నోట్ పుస్తకాల పంపిణీ

పెరవలి: మండలంలోని కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాత బొంతు సత్యనారాయణ ఆర్థిక సాయంతో నోట్ పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ పుస్తకాలను వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు తోట సురేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దానాల్లో అన్నింటి కన్నా విద్యాదానం గొప్పదన్నారు. పేదల విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. మూడు గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.15 వేల విలువ గల పుస్తకాలు అందించారు. సర్పంచ్ భావన మధు, పెదరాయుడు, శేషగిరిరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి


తాడిపర్రులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. తాడిపర్రు గ్రామంలో శనివారం రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయమన్నారు. అవినీతికి తావులేకుండా, అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇంత మంచి చేస్తున్న ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు అక్కిన రామకృష్ణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, ఏనుగుపల్లి రాఘవులు, మారిశెట్టి నర్సింహమూర్తి, కర్నె మారియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు ప్రభుత్వ పథకాలు


కాపవరంలో సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల ముంగిటకు ప్రభుత్వ పథకాలన్ని చేరుతున్నాయని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. కాపవరంలో శనివారం ఆయన పర్యటించారు. పలు కార్యాలయాలు, రోడ్లను ప్రారంభించి, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, గ్రావెల్ రోడ్లను ప్రారంభించారు. అనంతరం రూ.75లక్షలతో జలజీవన్ మిషన్ పథకంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

సొంత నిధులతో అంబేడ్కర్‌కు నీడ

ఎంతో కాలంగా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి రూ.2.50 లక్షలతో షెల్టర్‌ను సర్పంచ్ బంటమెల్లి రత్నాజీరావు సొంత నిధులతో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వీరమళ్ల సత్యనారాయణ, ఇరిగేషన్ డైరెక్టర్ దొడ్డిగర్ల స్వాతి, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, కాపవరం సర్పంచ్ బంటుమెల్లి రత్నాజీరావు. సొసైటీ అధ్యక్షుడు మెర్ల భవానీ, ఎంపీటీసీ సభ్యులు మెర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ జక్కంశెట్టి సుబ్బారావు, ఎంపీడీఓ దామోదరరావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెప్మాతో మహిళలకు ఉపాధి


మెప్మా మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: మెప్మా మార్కెట్ల ఏర్పాటుతో పట్టణంలో స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధి లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో సంతమార్కెట్ వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెప్మా మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. డ్వాక్రా మహిళలు ఉపాధి కల్పిస్తుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాజుల రంగారావు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, మెప్మా సీటీ మెనేజర్ శివప్రసాద్, ఆర్పీలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

105 మందికి వైద్య పరీక్షలు

నిడదవోలు: స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిడదవోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో 105 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యుల, ఆడిటర్స్ దినోత్సవం సందర్భంగా పట్టణ ప్రముఖ వైద్యులు కల్యాణ్ చక్రవర్తి, ఆడిటర్ పచ్చిపులుసు శ్రీరామారావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, క్లబ్ కార్యదర్శి ఎండీ ఫయాజ్, కామిశెట్టి సత్యనారాయణ, ఉప్పులూరి వీరభద్రరావు, కారింకి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవం ఏర్పాట్లపై సమావేశం

తాళ్లపూడి: వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 9న వజ్రోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్టు పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పాఠశాల వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేడుక ఏర్పాట్లపై చర్చించారు.ఈ సమావేశంలో శీర్ల సత్యనారాయణ , వీరమల్లు సూర్యనారాయణ, శీర్ల బ్రంహానందం, బొరుసు వెంకటేశ్వరరావు, అడ్డాల డేవిడ్ రాజు, ఎ.రాజా, ఎం.సత్యనారాయణ, కె.గోపాల్, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగంతో సుస్థిర ఆర్థికాభివృద్ధి

కొవ్వూరు: సహకార రంగం ద్వారా 2030 నాటికి సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యాలను అనుగుణంగా పనిచేయాలని డివిజనల్ సహకారి అధికారి కె.సుబ్బారావు సూచించారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా పట్టణంలో శ్రీరామా సొసైటీ వద్ద సహకార జెండాను ఆవిష్కరించారు. సొసైటీ కార్యదర్శి బొర్రా రాధాకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అరటి రైతులకు నష్ట పరిహారం

దేవరపల్లి: గోపాలపురం మండలం దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 2022 ఖరీఫ్‌కు సంబంధించి అరటి పంట నష్ట పరిహారం మంజూరైనట్టు గోపాలపురం వ్యవసాయాధికారి రాజారావు తెలిపారు. గోపాలపురం మండలంలో 41 మంది రైతులకు రూ.6,74.,223. దేవరపల్లి మండలంలో 131 మంది రైతులకు రూ.20,85,113, నల్లజర్ల మండలంలో 89 మంది రైతులకు రూ.3,62,216 మంజూరైనట్టు ఆయన తెలిపారు. పరిహారం రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు ఆయన చెప్పారు.

ఈ స్టేషన్లకు ఎర్రజెండా

- చాగల్లు, బ్రాహ్మణగూడెం, బలభద్రపురం రైల్వేస్టేషన్లు మూసివేత
- తగినంత టికెట్ అమ్మకాలు లేవని సాకుతో నో హాల్ట్
- ఆందోళనలో ప్రయాణికులు



బ్రాహ్మణగూడెం రైల్వేస్టేషన్

చాగల్లు: తక్కువ ఖర్చు, సునాయాసంగా సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైలు ప్రయాణం గ్రామీణ ప్రాంత ప్రజలకు రైల్వే శాఖ దూరం చేసింది. సామాన్యులకు అందుబాటులో ఉండే పాసింజర్ రైలు ప్రయాణాన్ని మరిచిపోవాల్సిన పరిస్థితులు తెచ్చింది. తూర్పుగోదావరి జిల్లాలో మూడు రైల్వే స్టేషన్లు రైల్వే శాఖ మూసేసింది. చాగల్లు మండలంలో చాగల్లు, బ్రాహ్మణగూడెం, బిక్కవోలు మండలంలో బలభద్రపురం స్టేషన్లను మూసేశారు. ఈ స్టేషన్లలో ప్రయాణికులు తక్కువగా ఉండడంతో తగినంత ఆదాయం రావడంలేదనే సాకుతో బ్లాక్ స్టేషన్ అయిన చాగల్లును ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆపేశారు. హాల్ట్ స్టేషన్లు అయిన బ్రాహ్మణగూడెం, బలభద్రపురం స్టేషన్లను జూన్ ఒకటో తేదీ నుండే మూసివేశారు.

ఏడాది క్రితం పెరిగిన టికెట్ ధరలు

కరోనా ప్రభావంతో మార్చి 2020 నుంచి రైళ్లు రద్దు చేశారు. తిరిగి ఏప్రిల్ 2022 నుంచి చాగల్లు, బ్రాహ్మణగూడెం, బలభద్రపురం స్టేషన్లలో పలు రైళ్లకు హాల్ట్ ఇచ్చారు. పాసింజర్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లగా మార్చి కొన్ని రైళ్లను మాత్రమే ఈ స్టేషన్లో నిలిచేలా చేశారు. సుమారు 50 కిలోమీటర్ల దూరం వరకూ రూ.10 ఉన్న టికెట్ ధరను రూ.30 పెంచారు. దీంతో సామాన్యుడికి పాసింజర్ రైలు ప్రయాణం భారంగా మారింది. నిత్యం సుమారు 15 రైళ్లు ఆగే చాగల్లు స్టేషన్లో గత ఏడాది నుంచి కేవలం 3 రైళ్లు, సుమారు 10 రైళ్లు ఆగే బ్రాహ్మణగూడెంలో రెండు రైళ్లకు మాత్రమే ఆగేందుకు అనుమతి ఇచ్చారు. కరోనాకు ముందు గతంలో ఇక్కడ ఆగే కొన్ని రైళ్లను ఆపకపోగా రాజమండ్రి – భీమవరం, భీమవరం– రాజమండ్రి. రాజమండ్రి– నరసాపురం, నరసాపురం–రాజమండ్రి రైళ్లను భీమవరం నుంచి నిడదవోలు, నరసాపురం నుంచి నిడదవోలు వరకూ మత్రమే నడుపుతున్నారు. విజయవాడ– విశాఖపట్నం పాసింజర్(57225), విశాఖపట్నం– విజయవాడ(57226) పాసింజర్ వంటి మరి కొన్ని రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. స్టేషన్లో ఆగే రైళ్లు తగ్గడం, టికెట్ ధరలు అమాంతంగా పెరగడంతో ప్రయాణికులు తగ్గారు. దీంతో టికెట్‌లు అమ్మకాలు తగ్గాయనే సాకు చూపి పూర్తిగా రైల్వే స్టేషన్లను రైల్వే అధికారులు ఒక పథకం ప్రకారమే మూసివేశారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

బస్సు సౌకర్యం లేక...

బ్రిటిష్ హయంలో ఏర్పాటైన ఈ స్టేషన్లను మూసివేయడం సరైన నిర్ణయం కాదని స్థానికులు అంటున్నారు. చాగల్లు రైల్వే స్టేషన్‌లో మండల కేంద్రమైన చాగల్లుతో పాటు మల్లవరం, చంద్రవరం, గౌరీపల్లి, మార్కొండపాడు గ్రామాల ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి ఈ రైల్వే స్టేషన్‌పై ఆధారపడుతారు. బ్రాహ్మణగూడెం నుంచి రాజమండ్రి పరిసర ప్రాంతాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేదు. రైళ్లపైనే ఆధారపడి ప్రయాణిస్తున్నారు. ఈ రైల్వేస్టేషన్ నుంచి చుట్టు పక్కల గ్రామాలైన దారవరం, కలవలపల్లి, ఎస్.ముప్పవరం, గరప్పాడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో దగ్గర ప్రాంతాలతో పాటు తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, అన్నవరం తదితర దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి ఈ స్టేషన్లు ఎంతో అనువుగా ఉండేవని ఇప్పుడు వీటిని శాశ్వతంగా మూసేయడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

20 ఏళ్లుగా హాల్ట్ ఏజెంట్‌గా సేవలందించా..



సుమారు 20 ఏళ్ల నుంచి బ్రాహ్మణగూడెం రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఏజెంట్‌గా పని చేస్తున్నాను. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆగే రైళ్లకు టికెట్లు విక్రయించేవాడిని. టికెట్‌ల వచ్చే కమిషన్‌తో కుటుంబాన్ని పోషించుకునే వాడ్ని. కరోనా తరువాత రైళ్లుకు హాల్ట్ సౌకర్యం కల్పించకపోవడం, ధరలు పెంచడంతో టికెట్ల అమ్మకాలు తగ్గాయి. రెండు రైళ్లే ఆగేవి. ప్రస్తుతం గత నెల ఒకటో తేదీ నుంచి వాటి రాకపోకలు కూడా రద్దు చేశారు.

– దీవీవీ కృష్ణ, హాల్ట్ ఏజెంట్, బ్రాహ్మణగూడెం రైల్వేస్టేషన్

స్టేషన్‌ను మూసేయడం దారుణం



బ్రిటిష్ కాలం నాటి నుంచి ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడుతున్న చాగల్లు స్టేషన్‌ను మూసివేయడం దారుణం. రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అన్నవరం వంటి ప్రాంతాలకు వెళ్లడానికి ఈ స్టేషన్ నుంచి రైలు ప్రయాణం ఎంతో సౌకర్యంగా ఉండేది.

– లకంసాని రామకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు, మల్లవరం